క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణకు నడుంబిగిద్దాం



మొక్కలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: పర్యావరణ పరిరక్షణకు నడుంబిగించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని 6, 7వ వార్డులో ఇంటింటికీ పూలు, పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏపుగా పెరిగిన చెట్లతోనే వర్షాలు సంమృద్ధిగా కురుస్తాయన్నారు. హరితహారం ద్వారా ప్రతి ఇంటిలో మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు పద్మ, లావణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

'దళిత బంధు' పేరుతో చిచ్చు



మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): బీఆర్ఎస్ ప్రభుత్వం దళిత బంధు పేరుతో కులాల మధ్య చిచ్చు పెడుతుందని బీఎస్పీ సిద్దిపేట నియోజకవర్గ అధ్యక్షుడు పుల్లూరు ఉమేష్ ఆరోపించారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. ప్రతి గ్రామానికి దళిత బంధు ఇస్తున్నామని అబద్ధపు హామీలు ఇస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ ఆగడాలను ప్రజలు ఓట్ల రూపంలో బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగంపల్లి యాదగిరి, నాయకులు అశోక్, మల్లేశం, భాను, నర్సింలు, శంకర్, అరుణ్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

'గృహలక్ష్మి'కి దరఖాస్తు చేసుకోండి

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో సొంత ఇళ్లు లేని లబ్ధిదారులు ప్రభుత్వం అందించే గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ రాజమౌళి సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

నిరుద్యోగులపై చిన్న చూపు



మాట్లాడుతున్న నాయకులు

సిద్దిపేటకమాన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులను విస్మరిస్తున్నాయని రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు శిభుఖురాని, రాజీవ్‌బెనర్జీ అన్నారు. సోమవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల ముందు మాత్రమే నిరుద్యోగుల సమస్యలను లేవనెత్తి.. అధికారంలోకి వచ్చాక విస్మరిస్తున్నారని మండిపడ్డారు. అంతకుముందు గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కార్మికుల త్యాగ ఫలితమే విలీనం

హుస్నాబాద్: అమరులైన ఆర్టీసీ కార్మికుల త్యాగాల ఫలితమే ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేశారని ఆర్టీసీ ఉద్యోగులు అన్నారు. సోమవారం డిపో ఎదుట సంబరాలు జరుపుకున్నారు. సీఎం కేసీఆర్, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, రవాణాశాఖ మంత్రి అజయ్‌కి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ వెంకటేశ్వర్, నాయకులు సామిల్, రామ్మోహన్ రెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): గ్రామీణ ప్రాంత ప్రజలకు మరింత వైద్య సేవలను అందించాలని ఎంపీపీ గజ్జెల సాయిలు, జెడ్పీటీసీ సూకూరి లక్ష్మీలింగం అన్నారు. మిరుదొడ్డి పీహెచ్‌సీ కేంద్రంలో సోమవారం జన ఆరోగ్య సమితి సమావేశం నిర్వహించారు. పీహెచ్‌సీ అభివృద్ధికి చేపట్టిన నిధుల ఖర్చులను, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, ఎంపీడీఓ రాజిరెడ్డి, డాక్టర్ అమీనా సుల్తానా, సీహెచ్‌ఓ లింగమూర్తి పాల్గొన్నారు.

'ప్రజా ఉద్యమాలకు తీరని లోటు'

మిరుదొడ్డి(దుబ్బాక): గద్దర్ మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని బహుజన ధూంధాం కో కన్వీనర్, అందె మ్యూజిక్ అకాడమీ డైరెక్టర్ అందె భాస్కర్ అన్నారు. సోమవారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ...గద్దర్‌కు తాను పలు వేదికల్లో డప్పు వాయిద్యాన్ని మోగించినట్లు గుర్తు చేశారు.

అడ్మిషన్లు ఫుల్.. సౌకర్యాలు నిల్

- ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొరవడిన వసతులు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

హుస్నాబాద్: హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసౌకర్యాలకు నిలయంగా మారింది. తాగు నీరు.. మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. అయితే అడ్మిషన్ల కోసం మాత్రం విద్యార్థులు పోటీ పడుతున్నారు. డిగ్రీ మొదటి సంవత్సరానికి సంబంధించి ఇప్పటివరకు 124 అడ్మిషన్లు రాగా.. ఈనెల 13 వరకు స్పెషల్ ఫేజ్ కింద ఇంకా వచ్చే అవకాశం ఉంది. ఇప్పటివరకు డిగ్రీ ప్రథమ సంవత్సరంలో 124 మంది, ద్వితీయ 80, ఫైనల్ ఇయర్‌లో 60 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అలాగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ కేంద్రం కూడా ఈ కళాశాలలోనే కొనసాగుతుంది.

కొత్త భవనంలోనూ అదే పరిస్థితి..

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసౌకర్యాలకు నిలయంగా మారడంతో మోడల్ స్కూల్ వెనుకభాగంలో ప్రభుత్వం రూ. 3.50 కోట్లతో కొత్త డిగ్రీ కళాశాల భవనాన్ని నిర్మించారు. ఈ భవనాన్ని మే 5వ తేదీన మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించారు. కళాశాలలో విద్యుత్ మీటర్లు బిగించి వైరింగ్ పూర్తి చేశారు. అయితే రక్షణ లేకపోవడంతో మీటర్లను పగులగొట్టి దొంగలు వైర్లను ఎత్తుకెళ్లారు. దీంతో కరెంట్ సరఫరాను నిలిపివేశారు. అలాగే తాగడానికి ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేయలేదు. సైన్స్ ల్యాబ్‌కు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయలేదు. ఈ నేపథ్యంలో అధ్యాపకులు కొత్త భవనంలోకి వెళ్లలేక.. పాత భవనంలో ఉండలేకపోతున్నారు.



నిరుపయోగంగా కొత్త డిగ్రీ కళాశాల భవనం



రేకుల షెడ్డులో పాత డిగ్రీ కళాశాల

అనుమతి రాలేదు



కొత్త డిగ్రీ కళాశాల భవనంలోకి వెళ్లడానికి ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నుంచి ఎలాంటి అనుమతి రాలేదు. కొత్త భవనంలో కరెంట్, బోరు లేదు. తాగు నీరు కోసం ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేయలేదు. ఇదే విషయం కమిషనర్‌తో పాటు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. కమిషనర్ నుంచి అనుమతి రాగానే కొత్త భవనంలోకి షిఫ్ట్ అవుతాం. – రాజిరెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, హుస్నాబాద్

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత

దుబ్బాక: విద్యార్థులు జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని లక్ష్యం దిశగా కృషి చేయాలని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్‌జీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, బ్యాగులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సామాజిక సమరసత వేదిక జిల్లా అధ్యక్షుడు అరవింద్, కోకన్వీనర్ రమేష్, ఎంఈఓ జోగు ప్రభుదాస్, ప్రిన్సిపాల్ గాజుల రాంచంద్రం పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని 18వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత

కోర్టు తరలింపును ఆపండి

దుబ్బాకటౌన్: దుబ్బాక నుంచి కోర్టును తిమ్మాపూర్‌కు తరలించే కుట్రను నిరసిస్తూ సోమవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో దుబ్బాక బంద్ చేపట్టారు. ఉదయం నుంచే కాంగ్రెస్ నాయకులు పట్టణంలో ర్యాలీ నిర్వహించి వ్యాపార, వాణిజ్య సంస్థలను మూసివేయించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అనంతుల శ్రీనివాస్, మున్సిపల్ అధ్యక్షుడు ఏసురెడ్డి, జిల్లా నాయకులు శ్రీరాం నరేందర్, మల్లేశం, ఆకుల భరత్, మంద శ్రీనివాస్ మాట్లాడుతూ.. దుబ్బాకలోనే కోర్టు నిర్మించేలా ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘునందన్‌రావు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే మాజీ ఏఎంసీ చైర్మన్ సిద్ది రాములు, పోతారం సర్పంచ్ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. దుబ్బాక ప్రజాప్రతినిధులంతా తక్షణమే తమ పదవులకు రాజీనామా చేసి మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో పోతారం మాజీ సర్పంచ్ బాలకిషన్, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చేనేత కార్మికుల అభివృద్ధికి కృషి



దుబ్బాక: చేనేత కార్మికులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాక: చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో సోమవారం రాత్రి చేనేత కార్మికులను ఎమ్మెల్యే రఘునందన్‌రావు సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేనేత కార్మికుల అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు గాజుల తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

చేనేతకు ప్రభుత్వం చేయూత

గజ్వేల్‌రూరల్: చేనేత రంగానికి టీఆర్ఎస్ ప్రభుత్వం చేయూతను అందిస్తుందని గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు దుర్గాప్రసాద్, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్ పట్టణం, ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో కార్మికులను సన్మానించారు.

కొమురవెల్లిలో..

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొండ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

రూ. 3 వేలు అందించడం హర్షణీయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): చేనేత మిత్ర ద్వారా నెలకు రూ. 3 వేలు అందించడం హర్షణీయమని సిద్దిపేట చేనేత సహకార పారిశ్రామిక సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.

చేర్యాల చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా భాస్కర్‌రెడ్డి



నూతనంగా ఎన్నికైన సభ్యులు

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నిక ఆదివారం వైశ్యభవన్‌లో నిర్వహించారు. ఈఎన్నికలో అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి పదవులకు ఇద్దరు చొప్పున పోటీ పడగా ఓటింగ్ నిర్వహించారు. అధ్యక్షుడిగా ఉడుముల భాస్కర్‌రెడ్డి తన సమీప ప్రత్యర్థి చేరి బాల్‌నారాయణపై 32 ఓట్ల మెజారిటీతో విజయం సాధించాడు. కార్యదర్శిగా బద్దిపడగ నర్సింహారెడ్డి, కోశాధికారిగా జిన్నారం రమేష్ గెలుపొందారు.

జీఓ 81 రద్దు చేయాలి

కోహెడ(హుస్నాబాద్): వీఆర్‌ఏ పట్టాదారులతో పాటు ఇస్నాదారులకు సైతం ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు మండల గ్రామ సేవకుల ఇస్నాదాలరుల సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సాయిలు, తేలు యాదగిరి, నర్సయ్య, రాజమల్లు, బాలనర్సు, సంపత్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

రంగనాయక సాగర్‌పై చెత్త సేకరణ

చిన్నకోడూరు(సిద్దిపేట): రంగనాయక సాగర్ రిజర్వాయర్‌పై ఆదివారం హాఫ్ మారథాన్ నిర్వహించగా, పాల్గొన్న వారికి టిఫిన్స్, స్నాక్స్, పండ్లు అందించారు. సోమవారం ఉదయం సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ సంపత్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, పాలకవర్గం, అధికారులు కట్టపై తిరుగుతూ చెత్తను సేకరించారు. పర్యాటకులు బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేయకుండా చెత్త కుండీలో వేయాలని సూచించారు. అయితే సిద్దిపేట మున్సిపల్ పాలకవర్గం, అధికారులు రంగనాయక సాగర్‌పై చెత్త సేకరణ చేపట్టడాన్ని మంత్రి హరీశ్‌రావు ప్రత్యేకంగా అభినందించారు.



చెత్తను సేకరిస్తున్న పాలకవర్గ సభ్యులు

గద్దర్‌కు ఘన నివాళి

జిల్లావ్యాప్తంగా ప్రజాసంఘాలు, వివిధ పార్టీల ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తన ఆట పాటలతో ప్రజలను చైతన్యవంతులను చేసిన గద్దర్ సేవలను కొనియాడారు.



దుబ్బాక: గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



హుస్నాబాద్: మౌనం పాటిస్తున్న కాంగ్రెస్ నాయకులు



జగదేవ్‌పూర్‌లో..

సస్యరక్షణతో అధిక దిగుబడులు

సిద్దిపేట ఏడీఏ పద్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): పంటలకు చీడ పీడలు ఆశించకుండా రైతులు తగిన సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు వస్తాయని సిద్దిపేట ఏడీఏ పద్మ అన్నారు. సోమవారం మండల పరిధిలోని విఠలాపూర్, గంగాపూర్‌లో వరి, మొక్కజొన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కత్తెర పురుగు నివారణకు వివిధ దశల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వరిలో కలుపు, సమగ్ర పోషక, యాజమాన్య పద్ధతులను వివరించారు. ఆమె వెంట ఏఓ జయంత్, ఏఈఓ, రైతులు ఉన్నారు.

యంత్రాలను వినియోగించుకోవాలి

మద్దూరు(హుస్నాబాద్): రైతులు వరి నాటు వేసే యంత్రాలపై దృష్టి సారించాలని ఏఓ రామకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని మర్మాములలో రైతు పెద్ద ఊట్ల నరసింహారెడ్డి పొలంలో నాటు వేసున్న యంత్రాన్ని పరిశీలించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ అఖిల్, రైతులు పాల్గొన్నారు.



విఠలాపూర్‌లో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

కార్మికులపై కక్షసాధింపు సరికాదు



హుస్నాబాద్ పట్టణంలో రాస్తారోకో చేస్తున్న కార్మికులు

హుస్నాబాద్: గ్రామ పంచాయతీ కార్మికులపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని పంచాయతీ కార్మికుల సంఘం డివిజన్ గౌరవ అధ్యక్షుడు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్ చేశాడు. సోమవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్మికులు 33 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం చర్చలకు పిలువకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు దుర్గయ్య, అక్కన్నపేట మండల అధ్యక్షుడు సాయిలు, నాయకులు సదానందం, వెంకటేశం, మహేందర్, సంపత్, తిరుమల, నర్సవ్వ, తదితరులు పాల్గొన్నారు.

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలో సోమవారం పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి బీఎస్పీ నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా కార్యదర్శి వెంకన్న, మండల ప్రధాన కార్యదర్శి లింగాల శ్రీనివాస్, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లకు అవగాహన

బెజ్జంకి(సిద్దిపేట): ఈవీఎంలపై ప్రతి ఒక్క ఓటరు అవగాహన కలిగి ఉండాలని నాయబ్ తహసీల్దార్ పార్థసారథి సూచించారు. మండలంలోని రేగులపల్లెలో సోమవారం గ్రామస్తులకు వాటి పనితీరును వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఐలయ్య, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తల్లిపాలు ముద్దు.. డబ్బా పాలు వద్దు

జగదేవ్‌పూర్(గజ్వేల్): తల్లిపాలు ముద్దు.. డబ్బా పాలు వద్దని పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, జగదేవ్‌పూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి సత్యప్రకాష్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. తల్లిపాలు అమృతం వంటివని, పుట్టిన పిల్లలకు వెంటనే ముర్రుపాలు తాగించాలని సూచించారు. కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచ్‌లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఆశవర్కర్లు, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గజ్వేల్‌రూరల్: పుట్టిన బిడ్డకు గంటలోపు పట్టించే ముర్రుపాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సీడీపీఓ వెంకటరాజమ్మ పేర్కొన్నారు. మండల పరిధిలోని జాలిగామ అంగన్‌వాడీ కేంద్రం–2లో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం గర్భిణులు, బాలింతలకు ముర్రుపాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ శివయ్య, ఎంపీటీసీ రాజిరెడ్డి, ఉపసర్పంచ్ స్వప్న నరేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రూప, గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): తల్లిపాలు బిడ్డకు అమృతం అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత అన్నారు. మండలంలోని కుందనవానిపల్లి గ్రామ పరిధిలోని చౌటకుంట తండా అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.

మిరుదొడ్డి(దుబ్బాక): తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మిరుదొడ్డిలోని ఐదు అంగన్‌వాడీ సెంటర్ల ఆధ్వర్యంలో సోమవారం తల్లిపాల ప్రాముఖ్యతపై అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు తీసుకునే పౌష్టికాహారంతో పాటు అప్పుడే పుట్టిన శిశువులకు ముర్రు పాలు పట్టే విధానంపై వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ప్రేమలత, రేణమ్మ, బుజ్జమ్మ, పున్నమ్మ, రేణుక, ఆశకార్యకర్త కవిత, తదితరులు పాల్గొన్నారు.



అక్కన్నపేట: మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత

సంక్షిప్త వార్తలు

❖ నేడు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

బెజ్జంకి(సిద్దిపేట): బీఆర్ఎస్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆపార్టీ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపెల్లి వినోద్‌కుమార్, కరీంనగర్ సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హాజరవుతారని తెలిపారు.

❖ డాక్టర్లకు రక్షణ కల్పించండి

నంగునూరు(సిద్దిపేట): నంగునూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బందిని రాత్రి వేళలో ఆకతాయిలు వేధింపులకు గురిచేస్తున్నారని డీఎంహెచ్‌ఓకు సోమవారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వాసర యాదమల్లు ఫిర్యాదు చేశారు. ఈవిషయమై ఉన్నతాధికారులు సిబ్బందిని విచారించాలని సూచించారు.

❖ సన్మానం

కొండపాక(గజ్వేల్): జప్తినాచారం గ్రామానికి చెందిన విద్యార్థి కృతిక భూపాల్‌లోని ఎయిమ్స్‌లో మెడికల్ సీటు సంపాదించడంతో సోమవారం ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు చింతల సాయిబాబా ఘనంగా సన్మానించారు.

❖ గోడ గడియారాల పంపిణీ

చేర్యాల(సిద్దిపేట): పట్టణంలోని వీరభద్రగార్డెన్‌లో సోమవారం ఉల్లేంగుల సేవా ట్రస్టు చైర్మన్ ఏకనందం పుట్టినరోజు సందర్భంగా ప్రజలకు రెండు వేల గోడ గడియారాలను, పేద మహిళలకు రూ. 10 వేల చొప్పున అందజేశారు.

❖ బాధిత కుటుంబాన్ని ఆదుకోండి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని గీతాంజలి ఒలంపియాడ్ స్కూల్ బస్ ఢీకొని మరణించిన మృతురాలి కుటుంబానికి రూ. 20 లక్షల నష్ట పరిహారం అందించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు అరవింద్ అన్నారు. ఈ మేరకు సోమవారం డీఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందించారు.

❖ దాతల సహకారం అవసరం

కొండపాక(గజ్వేల్): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతల సహకారం అవసరమని ఎంపీటీసీ యాదగిరి పేర్కొన్నారు. మండల పరధిలోని ఖమ్మంపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో మంతూరి నారాయణ జ్ఞాపకార్థం కుమారులు 100 ప్లేట్లు, గ్లాసులను అందజేశారు.

❖ ఆర్టీసీ సేవలను వినియోగించుకోండి

గజ్వేల్‌రూరల్: ఆర్టీసీ అందిస్తున్న సేవలను ప్రయాణికులు వినియోగించుకోవాలని సింగాటం గ్రామ విలేజ్ బస్ ఆఫీసర్ జయేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సింగాటంలో గ్రామస్తులకు ఆర్టీసీ అందిస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

❖ కిడ్నీ బాధితుడికి అండగా..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నారాయణరావుపేట మండల పరిధిలోని గుర్రాలగొందికి చెందిన గరిపెల్లి బాలలింగం కిడ్నీ సంబంధిత వ్యాధితో ఇబ్బంది పడుతుండడంతో జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో సోమవారం బాధితుడికి జిల్లా కేంద్రంలో రూ. 30వేలు ఆర్థిక సహాయం అందించారు. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి గంప శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయిత రత్నాకర్, జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు కాసం నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

❖ అర్హులకే ఇళ్లు మంజూరు చేయాలి

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని అయినాపూర్‌లో అర్హులైన లబ్ధిదారులకు గృహలక్ష్మి పథకం కింద ఇళ్లు మంజూరు చేయాలని సర్పంచ్ చెరుకు రమణారెడ్డి కోరారు. సోమవారం గ్రామంలోని నిరుపేదలతో కలిసి ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందించారు.

❖ కాంగ్రెస్ నాయకుల సంబరాలు

కోహెడ(హుస్నాబాద్): రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వం పునరుద్ధరణపై కోహెడ మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు శెట్టి సుధాకర్, ప్రతాపరెడ్డి, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

❖ చట్టాలపై అవగాహన అవసరం

దుబ్బాక: ప్రతీ ఒక్కరికి చట్టాలపై అవగాహన కలిగి ఉండడం అవసరమని దుబ్బాక ఎస్సై గంగరాజు అన్నారు. సోమవారం ధర్మాజీపేట జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు.

❖ మద్దూరులో..

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని రేబర్తి హైస్కూల్‌లో సోమవారం షీటీంలపై అవగాహన కల్పించారు. మద్దూరు ఏఎస్‌ఐ విజయ్‌కుమార్ బాలికలకు షీటీం విధులను వివరించారు.

❖ ఆర్థిక సహాయం

మద్దూరు(హుస్నాబాద్): బైరాన్‌పల్లిలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన పలు కుటుంబాలను సోమవారం మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పరామర్శించి ఒక్కొక్క కుటుంబానికి రూ. 5 వేల ఆర్థిక సహాయం అందించారు.